సాక్షి ఏలూరు

గురువారం । 28 । మార్చి । 2024




'పది' పరీక్షలు ప్రశాంతం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. 8లో ▸



రూ. 4.60 లక్షలు సీజ్

ఏలూరు జిల్లాలో బుధవారం పలు చోట్ల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4.60 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహరి శుక్రవారం (ఉదయం)
ఏలూరు	6.25	4.40
భీమవరం	6.22	4.42

న్యూస్‌రీల్

సి-విజిల్ ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి



రిటర్నింగ్, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): సి-విజిల్ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సి-విజిల్ ఫిర్యాదులను నిర్దేశించిన సమయంలో పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు. కొత్త హోర్డింగ్‌లకు అనుమతులు ఇవ్వవద్దన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింటింగ్‌కు ఎలాంటి అనుమతి లేదని ఇప్పటికే ఉన్నవాటిని వెంటనే తొలగించాలన్నారు. ఇంటి వద్ద ఓటింగ్‌కు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్ల వారీగా 85 సంవత్సరాలు నిండిన వారు, విభిన్న ప్రతిభావంతులను గుర్తించాలన్నారు. సర్వీస్ ఓటర్ల వివరాలను పరిశీలించి నివేదికను అప్‌డేట్ చేయాలన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీకి సంబంధించి ఆయా పోస్టాఫీసుల్లో ఇంకా బట్వాడా కావల్సిన కార్డుల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్‌ఓ డి.పుష్పమణి, రిటర్నింగ్ అధికారులు ఎంఎస్‌కె ఖాజావలి, కె.అద్దయ్య, ఎం.ముక్కంటి, వై.భవానీశంకరి, కె.భాస్కర్, నోడల్ అధికారులు డీటీసీ ఎస్.శాంతకుమారి, జెడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్. సుబ్బారావు, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్ పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి

ఏలూరు(మెట్రో): ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీలు మరింత అప్రమత్తంగా ఉండి జిల్లా వ్యాప్తంగా నిఘాను మరింత పటిష్టపరచాలని కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు తదితరులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు పరిచే కార్యక్రమంలో భాగంగా స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-7, వివరాలను సరిదిద్దేందుకు పెండింగ్ ఉన్న ఫారం-8ను చట్టబద్ధమైన విధానంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సువిధ, ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. సి-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడంపై దృష్టి పెట్టాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీ పొడిగించినట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బీ.సోమశేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు (బీసీ,మైనారిటీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆయా వర్గాలకు చెందిన పిల్లలకు 2024-25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

ఫాం-7, 8 దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

ఏలూరు(మెట్రో): పెండింగ్‌లో ఉన్న ఫాం-7, 8 లను వేగవంతంగా పరిష్కరించాలని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో పెండింగ్‌లో ఉన్న ఫారం-7, 8 దరఖాస్తుల పరిష్కారం, రాజకీయ పార్టీలకు అనుమతుల జారీ, సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ తదితరులు వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు అంశాలను సమీక్షించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో కొత్త వంగడం

- స్వర్ణకు బదులు ఎంటీయూ 1318 సాగుకు ప్రోత్సాహం
- రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ
- రానున్న మూడేళ్లకు యాక్షన్‌ప్లాన్ రూపకల్పన
- స్థానిక వినియోగానికి ఎంటీయూ 1224, బీపీటీ 2846, ఎంటీయూ 1271, ఆర్‌ఎన్‌ఆర్ రకాలు



సాక్షి, భీమవరం: ఖరీఫ్‌లో అధిక దిగుబడి సాధించేలా, స్థానిక పరిస్థితులను తట్టుకునేలా కొత్త వంగడం సాగు చేసేలా వ్యవసాయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సాగుకాలం, స్థానిక పరిస్థితులు, విత్తనాల లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రానున్న మూడేళ్లకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల బృందం చర్యలు చేపట్టింది. అధికశాతం విస్తీర్ణంలో కొత్త వంగడాల వైపు రైతులను చైతన్యవంతం చేసేలా కార్యాచరణ రూపొందించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంట తెగుళ్లు, వైపరీత్యాలను ఎదురొడ్డి నిలిచే ఆధునిక వంగడాలను అందుబాటులోకి తెస్తున్నా రైతులు కాలం చెల్లిన వాటినే సాగుచేయడం పరిపాటిగా మారింది. జిల్లాలో పశ్చిమ డెల్టా, మెట్ట ప్రాంతంలోని 2.14 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతుండగా 85 శాతం విస్తీర్ణంలో స్వర్ణ (ఎంటీయూ-7029) వెరైటీని సాగుచేస్తున్నారు. మిగిలిన మేర ఇతర వెరైటీలు సాగుచేస్తున్నారు. స్వర్ణ కాండం దృఢంగా లేకపోవడంతో వర్షాలు, గాలులకు పడిపోతుంది. తొలకరి చివర్లో వచ్చే తుఫాన్లను స్వర్ణ వెరైటీ తట్టుకోలేక రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

కొత్త వంగడాలకు ప్రాధాన్యం : రానున్న సీజన్‌కు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసే పనిలో వ్యవసాయశాఖ నిమగ్నమైంది. జేడీ జెడ్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మార్టేరులోని రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డాక్టర్ మల్లిఖార్జున్, ఏపీ సీడ్స్ డీఎం అనిత, వ్యవసాయాధికారిణి మాధురి, ఏడీఏలు, ఏఓలు బుధవారం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వంగడాలు, వాటికి ప్రత్యామ్నాయంగా అధిక దిగుబడులనిచ్చే ఆధునిక వంగడాలు, వాటి సాగుకాలం తదితర అంశాలపై చర్చించారు. స్థానిక పరిస్థితులకు అనువైన వంగడాలను ఎంపిక చేశారు. వాటి ప్రత్యేకతలపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ఖరీఫ్‌లో వాటి సాగును ప్రోత్సహించనున్నారు. ఖరీఫ్‌లో విపత్తులను ఎదురొడ్డి నిలిచి అధిక దిగుబడినిచ్చేలా మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం రూపొందించిన ఎంటీయూ 1318 వెరైటీని ఖరీఫ్‌లో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా సాగుచేసేలా రైతులను చైతన్యవంతం చేయాలని నిర్ణయించారు.

సన్నాల్లో అనువైన రకాల ఎంపిక : ప్రస్తుతం ఖరీఫ్‌లో స్వర్ణ, రబీలో శ్రీధృతి వెరైటీలు అధికశాతం విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. స్థానికంగా అధిక శాతం సన్నాల వెరైటీలకు ప్రాధాన్యమిస్తుండటంతో జిల్లాలో సాగవుతున్న స్వర్ణ, శ్రీధృతి వెరైటీలు పూర్తిగా ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. రైతులు లాభాలు ఆర్జించేందుకు స్థానికంగా వినియోగించే వెరైటీల సాగుపై సమావేశంలో చర్చించారు. సన్నాల రకాల్లోని ఆధునిక వంగడాలైన ఎంసీఎం 103, ఎంటీయూ 1224, బీపీటీ 2846, ఎంటీయూ 1271, ఆర్ఎన్ఆర్ 15048 వెరైటీలు స్థానిక పరిస్థితులకు అనువైనవిగా ఎంపిక చేశారు. వీటి సాగుకు కౌలు రైతులు ముందుకు వచ్చే పరిస్థితులు లేనందున అసలు రైతులను ప్రోత్సహించాలని నిర్ణయించారు. అసలు రైతులు, సాగు విస్తీర్ణం గుర్తించి రానున్న సీజన్‌లో అధికశాతం విస్తీర్ణంలో ఈ వెరైటీలు సాగుచేయించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆయా వెరైటీల విత్తనాలు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఎంటీయూ 1318 ప్రత్యేకతలు



ఎంటీయూ 1318 సాగుకాలం 150 రోజులు. కాండం దృఢంగా ఉండటం వల్ల వర్షాలకు పడిపోదు. గింజలు రాలడం తక్కువ. చేనుపై మొలకెత్తవు. స్వర్ణ రకం ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడినిస్తే ఈ రకం 35 నుంచి 40 బస్తాల దిగుబడినిస్తుంది. తెగుళ్ల బెడద తక్కువ.

ఎంసీఎం 103



ఈ సన్నరకం వెరైటీ సాగు కాలం 140 రోజులు. చౌడు భూముల్లో మంచి దిగుబడినిస్తాయి. పిలక శక్తి ఎక్కువగా ఉంటుంది. దోమ, ఎండాకు తెగులును తట్టుకుంటాయి. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి ఇస్తుంది.

ఎంటీయూ 1224

మధ్యస్థ సన్నగింజ రకం. సాగుకాలం 130 నుంచి 140 రోజులు, 40 నుంచి 50 బస్తాల దిగుబడి. దోమపోటు, అగ్గితెగులును తట్టుకుంటుంది. ఎత్తు తక్కువగా పెరగడం వలన వర్షాలకు పడిపోకుండా నిలబడుతుంది.



ఎంటీయూ 1271



గింజలు తెలుపుగా మధ్యస్థ సన్నంగా ఉంటాయి. ఖరీఫ్‌లో సాగు కాలం 135 నుంచి 140 రోజులు. ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడినిస్తుంది. కాండం బలంగా, దృఢంగా ఉండటం వలన వర్షాలకు పడిపోకుండా ఉంటుంది.

బీపీటీ 2846



పంటకాలం 145 నుంచి 150 రోజులు. గింజలు సన్నగా ఉంటాయి. ఎకరాకు 40 నుంచి 45 బస్తాల దిగుబడి వస్తుంది. అగ్గితెగులు, దోమ పోటును తట్టుకుంటాయి. సన్న బియ్యం మంచి నాణ్యతను కలిగి ఉంటాయి.

సాగులో వైవిధ్యం అవసరం



ప్రస్తుత పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే ఎన్నో ఆధునిక వంగడాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కొత్తరకం వంగడాలు సాగు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రైతులకు లాభసాటిగా ఉండేలా జిల్లా పరిస్థితులకు అనువైన వంగడాలు ఎంపిక చేశాం.

– డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (వరి), మార్టేరు కేంద్రం

రకాల మార్పిడి తప్పనిసరి



సాగులో నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేందుకు వెరైటీయల్ రీప్లేస్‌మెంట్ రేషియో (రకాల మార్పిడి నిష్పత్తి) చాలా అవసరం. రైతులను ప్రోత్సహించి రానున్న సీజన్లలో పాత వెరైటీలకు ప్రత్యామ్నాయంగా వచ్చిన కొత్త వెరైటీలు, స్థానికంగా వినియోగించే వంగడాల సాగుకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– జెడ్ వెంకటేశ్వరరావు, జేడీ, వ్యవసాయశాఖ, పశ్చిమగోదావరి జిల్లా

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

ఏలూరు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టడం ఖాయమని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నుంచి భారీ ఎత్తున వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ, జనసేన నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరానికి చెందిన 200 మందికిపైగా జనసేన, టీడీపీ కార్యకర్తలు మునిశెట్టి సాయికుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. 49వ డివిజన్ ప్రాంతానికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే ఆళ్ళ నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పరసా శశి, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి భారీ విజయాన్ని సాధించి అధికారం చేపట్టడం లాంఛనమే అన్నారు. నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, క్లస్టర్-1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, క్లస్టర్-3 పార్టీ అధ్యక్షుడు మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు



49వ డివిజన్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మొద్దు

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: చంద్రబాబు కూటమి చేసే మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు పంచాయతీ శివారు సాధుగారి దిబ్బ, చిన లింగంపాడు, పెద్దలింగంపాడు గ్రామాల్లో బుధవారం సాయంత్రం మన ఊరికి మన వాసన్న- మంచి చేసాడు మళ్లీ చేస్తాడు నినాదంతో ఎమ్మెల్యే వాసుబాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీ, ఎమ్మెల్యేకి రెండు బటన్లు నొక్కి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. లింగంపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాల్లో మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చుతూ రెట్టింపు ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లిన వాసుబాబును అక్కాచెల్లెమ్మలు, వృద్ధులు ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకున్నారు. తమ ఇంటికి అందిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను వాసుబాబుకు చెప్పి సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.



లింగంపాడులో ఆప్యాయంగా పలకరించి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

జగనన్న నాయకత్వంలో పారదర్శక పాలన



కానుకొల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

మండవల్లి: పారదర్శక పాలన అందజేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ(జీవీఆర్) అన్నారు. మండలంలోని కానుకొల్లు సచివాలయ పరిధిలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 30వ రోజు బుధవారం జరిగిన ప్రజా ఆశీర్వాద యాత్రలో వారు పాల్గొని ప్రసంగించారు. మాట ఇస్తే కట్టుబడి ఉండే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్నారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా భావించి కుల, మతాలకతీతంగా ఫలాలను అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ అధికారం కట్టబెట్టాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని పేర్కొన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైస్ ఎంపీపీ అగస్తే ఆదివిష్ణు, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, పార్టీ నాయకులు బొమ్మనబోయిన గోకర్ణ, మెండా సురేష్, సర్పంచ్ నాగదాసి థామస్, ఎంపీటీసీ పుట్టిమీనా కుమారి, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు జి సత్యవరప్రసాద్, శొంఠి కుమారస్వామి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు పాల్గొన్నారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు: కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడిగా 40ఏళ్ల పాటు పనిచేసిన దివంగత బొబ్బిలి కొండలరావు జ్ఞాపకార్థం డీఏఆర్ కళాశాల ఆవరణలో ఈ నెల 28 నుంచి 31 వరకు జాతీయ స్థాయి పురుషుల బాస్కెట్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించనున్నారు.

సంక్షేమానికి మళ్లీ పట్టం కడదాం

నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్నకు మళ్ళీ అధికారం అందించి, రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగిద్దామని నూజివీడు ఎమ్మెల్యే మేకాప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు ఆధ్వర్యంలో రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు మళ్ళీ అధికారమిచ్చి, రెండోసారి ముఖ్యమంత్రిని చేయడం ద్వారా నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, దివంగత వైఎస్సార్ రుణం తీర్చుకోవాలన్నారు. జగనన్న నాయకత్వంలో నూజివీడు నియోజక వర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఉద్వేగంగా ప్రసంగించారు. రమణక్కపేటలో ప్రభుత్వాస్పత్రి, వ్యవసాయ సొసైటీలకు నూతన భవనాలు, శ్మశాన వాటిక అభివృద్ధి, రెండు గ్రామాల్లోనూ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, నూతన వాటర్ ట్యాంకులు నిర్మించి, అంతర్గత సీసీ రహదారులు అభివృద్ధి చేయించామన్నారు. ఎమ్మెల్యే ప్రచారానికి ఇరు గ్రామ ప్రజలతోపాటు మండలంలోని పలు గ్రామాల కార్యకర్తలు, మహిళలు, అధికంగా తరలి రావడంతో వీధులన్నీ జనసంద్రంగా మారాయి. యువకులు బైక్‌లతో సందడి చేస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. 1000కి పైగా బైక్‌ల ర్యాలీ, బాణాసంచాతో యువకులు ఆద్యంతం సందడి చేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ కంబాల కృష్ణవేణి, వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్ రంగు ధనలక్ష్మి, ఉప సర్పంచ్‌లు రంగు సత్యనారాయణ, వరహాలు, ఎంపీటీసీ పుచ్చకాయల వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు సభ్యుడు చిట్లూరి శ్రీనివాసరావు, సొసైటీల అధ్యక్షులు లక్ష్మయ్య, లింగారావు తదితరులు పాల్గొన్నారు.



రమణక్కపేటలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ఎన్నికల ప్రచారం

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రిగా జగనన్నను మళ్లీ గెలిపించుకుని సంక్షేమాన్ని సాధించుకుందామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కోటనాగవరం సచివాయం పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మోస పోవద్దన్నారు. చంద్రబాబు గత ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. మళ్లీ కుట్రపూరిత రాజకీయలతో అబద్ధపు హామీలతో మోసం చేసేందుకు రాబోతున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని చెప్పారు. సంక్షేమ పథకాలు తిరిగి కొన సాగాలంటే త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పోలవరం వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంటు అభ్యర్థి కారుమూరి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత వివరించి పార్టీ గెలుపుకు కృషి చేద్దాం అన్నారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో పేదలకు ప్రభుత్వ పాలన చేరువైందని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్‌లు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. వలంటీర్‌లపై పవన్ కళ్యాణ్, టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు తెల్లం వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపిపిలు కుక్కల వరలక్ష్మి, సర్పంచ్ పెడకం విజయలక్ష్మి, నాయకులు నక్కా శివాజీ, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్

ఏలూరు(మెట్రో): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధిస్తూ కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలు లైసెన్స్ కలిగిన ఆయుధాలు వెంట తీసుకువెళ్లడం, ప్రదర్శించడం నిషేదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా నిషేదాజ్ఞలు తక్షణం అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

సీఐ సతీష్‌కు డీజీపీ సిల్వర్ మెడల్


పాలకొల్లు రూరల్ సీఐ కుడుపూడి సతీష్

యలమంచిలి: పాలకొల్లు రూరల్ సీఐ కుడుపూడి సతీష్ డీజీపీ డెస్క్ సిల్వర్ మెడల్ అవార్డుకు ఎంపికయ్యారు. పోలీసులు విధి నిర్వహణలో ప్రదర్శించిన శక్తి సామర్థ్యాలను గుర్తించి వారిని ప్రోత్సాహించేందుకు ప్రతి సంవత్సరం ఈ అవార్డును అందజేస్తారు. ఈ ఏడాది సీఐ సతీష్‌ను ఎంపిక చేస్తూ డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలు వెలువడ్డాయి. సతీష్ 2019లో నందిగామ సీఐగా పనిచేస్తున్న సమయంలో కూడా డీజీపీ బ్రౌన్జ్ డెస్క్ అవార్డు రావడం విశేషం. తనకు అవార్డు ప్రకటించిన డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డికి, సిఫారసు చేసిన ఉన్నతాధికారులకు, సహకరించిన తోటి సిబ్బందికి సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు సీఐ సతీష్‌ను అభినందించారు.

కవి ప్రసాద్‌కు పురస్కారం


కవి ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తణుకు: అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జానపద స్వరగానం, పల్లె జానపద పట్టాభిషేకం కార్యక్రమంలో తణుకుకు చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు పురస్కారం లభించింది. ఆయన రచించి గానం చేసిన దర్మాపురీ దానమ్మా అనే జానపద గేయానికి ప్రశంసలు లభించాయి. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శి అరవ జయపాల, రాష్ట్ర ఉపాధ్యక్షులు సర్వోత్తమనాయుడు, తిరుపతి శాఖ కోశాధికారి ధనాశి ఉషారాణి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.


ఉండి: ఉండి పరీక్షా కేంద్రం నుంచి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థులు

పది పరీక్షలు ప్రశాంతం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 18వ తేదీన పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో బుధవారం నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షకు 21,511 మంది హాజరు కావాల్సి ఉండగా 759 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 51 పరీక్షా కేంద్రాల్లో విద్యాశాఖ, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

ఏలూరు జిల్లాలో 96.69 శాతం హాజరు

ఏలూరు జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగియగా, 139 కేంద్రాల్లో ఆఖరిరోజు నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు మొత్తం 23,813 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 23,024 మంది హాజరయ్యారు. 789 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు 2,874 మందికి గాను 1,232 మంది హాజరు కాగా 1,642 మంది గైర్హాజరయ్యారు. ఈ మేరకు రెగ్యులర్ విద్యార్థుల హాజరు శాతం 96.69గా నమోదైంది. పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 52 పరీక్షా కేంద్రాలను, జిల్లా స్థాయి పరిశీలకులు 7 కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఒక పరీక్షా కేంద్రాన్ని చొప్పున మొత్తం 65 కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. ఈ పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చెప్పారు. కాగా పాత ఎస్ఎస్‌సీకి సంబంధించి ఈ నెల 28, 30 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

– భీమవరం/ఏలూరు (ఆర్ఆర్‌పేట)


భీమవరం: భీమవరంలో పరీక్ష రాసి ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు


భీమడోలు : విజయ సూచిక చూపుతున్న పోలసానిపల్లి గురుకుల విద్యార్థినులు

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించండి

భీమవరం సమీక్షలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్


భీమవరం సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్పీ అజిత

భీమవరం: సార్వత్రిక ఎన్నికల విధులను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భీమవరం పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా ట్రోలింగ్స్, తప్పుడు ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాకు క్లాం వేసేలా చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని అశోక్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, శాంతియుతంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి ఎన్నికల కమిషన్ నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత ఎన్నికల సమయంలో క్రిమినల్ కేసులు నమోదైనవారిని ముందుగా బైండోవర్ చేసి వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ముందుగానే సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులను నియమించి, సాయుధ దళాలతో ఫుట్ పెట్రోలింగ్ ద్వారా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలన్నారు. గత ఎన్నికల్లో బూత్ స్థాయిలో జరిగిన గొడవలు, అవకతవకలు, అక్రమాలు, నేర కార్యకలాపాలు వంటిఅంశాల ఆధారంగా పటిష్ట బందోబస్తు, కేంద్ర సాయుధ బలగాల మోహరింపుతో తగిన భద్రతపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ అజిత మాట్లాడుతూ రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా అదనపు ఎస్పీ (ఎస్ఈబీ) ఏటీవీ రవికుమార్, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డీఎస్పీలు వి.నారాయణస్వామిరెడ్డి, డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, జి.శ్రీనివాసరావు, జిల్లా ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మృత్యుంజయరావు హెచ్చరించారు. 'కోడ్ వేళ భూపందేరాలు?' శీర్షికన మంగళవారం 'సాక్షి' లో ప్రచురితమైన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించగా, వారి ఆదేశాల మేరకు తహసిల్దార్ మృత్యుంజయరావు తన సిబ్బందితో కలిసి సింగన్నగూడెం సాయిబాబా గుడి ఎదురుగా ఆక్రమణలో ఉన్న రోడ్డు పోరంబోకు భూమిలో వేసిన ప్లానులు, గుడిసెలను అధికారులు ధ్వంసం చేసి, ఆ స్థలం చుట్టూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మృత్యుంజయరావు మాట్లాడుతూ ఎవరైనా ఈ భూమిని ఆక్రమించాలని చూస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ శేఖర్, ఆర్ఐ నవీన్‌కుమార్, వీఆర్వో రజిని, పంచాయతీ కార్యదర్శి పుల్లారావు పాల్గొన్నారు.


ప్రభుత్వ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం

ఏలూరు (టూటౌన్): భార్యపై అనుమానంతో అతికిరాతకంగా నరికి చంపిన భర్త నేరం రుజువు కావడంతో ఏలూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి చింతలపూడి పురుషోత్తం కుమార్ నిందితుడికి యావజ్జీవిత కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, పీపీ కోనే సీతారామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకటేశ్వరరావు తన భార్య అయిన రోజాపై అనుమానంతో 2016 ఏప్రిల్ 9వ తేదీన ఆమె తన తల్లిదండ్రుల ఇంట్లో రాత్రి 11 గంటల సమయంలో నిద్రిస్తుండగా కొబ్బరి బొండాల కొట్టే కత్తితో మెడపై నరకగా తాళ్లూరి రోజా అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటి పెదవేగి ఎస్సై వి.రామకోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. అనంతరం కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి అప్పటి సీఐ అడపా నాగమురళీ కోర్టులో చార్జీషీటు ఫైల్ చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఇన్‌స్పెక్టర్ కొండవీటి శ్రీనివాస కుమార్, ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.వాసు, జిల్లా కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్సై సిసిలిలను ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అభినందించారు.

వలంటీర్ల ప్రచారం వాస్తవం కాదు

ఏలూరు (మెట్రో): వలంటీర్ల ప్రచారంపై వచ్చిన వార్తలపై ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి వివరణ ఇచ్చారు. మున్సిపల్ వెహికల్ షెడ్డు సమీపంలో ఉన్న సచివాలయ నెంబర్ 42, 43, 44 వీటిలో క్షేత్రస్థాయిలో ఫొటో క్లిప్పింగ్ ఆధారంగా పరిశీలించిన మీదట మూడు సచివాలయాలకు సంబంధించినది కాదని రుజువు కాబడిందని చెప్పారు. ఎక్కడా కూడా ఇప్పటివరకు ఓటర్ల ఫొటో స్లిప్పులు తయారు చేయడానికి ఆస్కారం లేదన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సెక్రటేరియేట్ సిబ్బందికి వేర్వేరు ప్రాంతాల్లో డివిజన్‌లో బూత్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా అమలు కాని ఎన్నికల కోడ్‌కు సంబంధించి ఎన్నికల నియమావళి ప్రకారం దివంగత నేతలకు శిలాఫలకాలనందలి ఫొటోలకు, పేర్లను తొలగించవలసిన ఆవశ్యకత లేదని ఆయన స్పష్టం చేశారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

ఏలూరు రూరల్: ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో ఓ గర్భిణి ముగ్గురు శిశువులకు జన్మనిచ్చిందని ఆశ్రం యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. వీరిలో ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్ల ఉన్నారని పేర్కొంది. కొద్దిరోజుల క్రితం ఏలూరుకు చెందిన జ్యోతి అనే గర్భిణి నెలలు నిండకుండానే ఉమ్మనీరు సమస్యతో బాధపడుతూ తమ ఆస్పత్రిలో చేరగా, గైనకాలజిస్ట్ డాక్టర్ వందన, మత్తు వైద్యులు కుమార్, చిన్నపిల్లల చికిత్స నిపుణురాలు నాగశ్రీ బృందం ఆపరేషన్ ద్వారా బిడ్డలను బయటకు తీశారన్నారు. పిల్లలకు ప్రాణాపాయం లేకపోయినప్పటికీ ప్రీమెచ్యూర్‌గా పుట్టడం వల్ల ప్రత్యేక శ్రద్ధతో వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు.

రాట్నాలమ్మకు రూ.14.90 లక్షల ఆదాయం


రాట్నాలమ్మ ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

పెదవేగి: రాట్నాలకుంటలో శ్రీరాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించగా రూ.14,90,334 ఆదాయం లభించిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు. దేవదాయశాఖ పర్యవేక్షకులు సుజన్‌కుమార్, డి.శంకర్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఆలయ మాజీ చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు, గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు శ్రీ షిర్డీసాయిలో టెన్త్ విద్యార్థులకు సదస్సు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు, మెగా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు దివాన్‌చెరువులోని బీజాపురి క్యాంపస్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియెట్‌తో పాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ నీట్, ఎయిమ్స్, ఐసీ, మాట్, క్లాట్, సివిల్స్ వంటి ఇంటిగ్రేటెడ్ కోర్సులపై నిపుణులు అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. అనంతరం పరీక్ష నిర్వహించి అర్హులైన వారందరికీ ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 95812 61119 నంబర్‌లో సంప్రదించాలని చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ తెలిపారు.

వాహన తనిఖీల్లో రూ.4.60 లక్షల నగదు సీజ్


బువ్వనపల్లి వద్ద తనిఖీల్లో పట్టుబడిన నగదును సీజ్ చేస్తున్న అధికారులు

నిడమర్రు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలో బుధవారం పలు చోట్ల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4.60 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉంగుటూరు మండలం బువ్వనపల్లి చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ1.75 లక్షలు నగదు సీజ్ చేసినట్లు నిడమర్రు ఎస్సై ఆర్.శ్రీను చెప్పారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ ఇన్‌చార్జ్, జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా ఆధ్వర్యంలో బువ్వనపల్లి సత్యనారాయణపురంలో జరిగిన వాహనాల తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా కారులో రూ.1.75 లక్షల నగదును తీసుకువెళుతున్న వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఏలూరు ఖజానా కార్యాలయం పంపించినట్లు తనఖీ బృందం సభ్యులు ఎం.మనోహర్, దుర్గారావు, రవికుమార్, మోహన్‌రావు చెప్పారు.

గణపవరంలో రూ.60 వేలు సీజ్

గణపవరం: సరిపల్లె శివారున సీపీఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ప్రత్యేక తనిఖీ బృందం తనిఖీల్లో భీమవరం నుంచి గణపవరం వైపు కారులో వెళుతున్న అన్నెంనీడి శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి రూ.60 వేల నగదు ఉన్నట్లు గుర్తించి, ఆ మొత్తానికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆసొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్‌టి అధికారిణి టీఎల్ సరస్వతి తెలిపారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఉంగుటూరు చెక్‌పోస్టు వద్ద బుధవారం నిర్వహించిన తనిఖీల్లో వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.81,200, మరొకరి నుంచి రూ.69,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీజ్ చేసినట్లు ఉంగుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఖాజావలీ చెప్పారు. ఎటువంటి ఆధారం లేకుండా నగదును తీసుకువెళితే తప్పక ఆధారాలను తనిఖీ అధికారులకు చూపించాలని ఖాజావలి తెలిపారు.


సరిపల్లెలో వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50వేలకు మించి నగదును తరలించడానికి అనుమతి లేదన్నారు. ఎవరు నగదు తీసుకువెళ్లినా ఆధారం లేకపోతే పట్టుకుంటామని ఆర్డీఓ వివరించారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట: కామవరపుకోట చెక్‌పోస్ట్ వద్ద ఎన్నికల అధికారి మొహిద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం పలు వాహనాలను సీఐఎస్ఎఫ్ జవాన్లతో కలిసి ఎస్సై జయబాబు బుధవారం తనిఖీ చేశారు. కామవరపుకోట నుంచి భీమడోలుకు వెళుతున్న కారును తనిఖీ చేయగా, ఆ కారులో ఒక వ్యక్తి నుంచి రూ.75 వేలను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఈ నగదును తహసీల్దార్ జేవీఆర్ రమేష్ సారథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సత్యవేణికి అప్పగించామన్నారు. ఏలూరు ఎన్నికల విభాగపు ట్రెజరీ అధికారికి నగదు అప్పగిస్తామని, నగదుకు సంబంధించి ఆధారాలు చూపించినట్లయితే నగదును తిరిగిస్తామన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సీఐఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.


నగదు స్వాధీనం చేసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సత్యవేణి

వైఎస్సార్ సీపీలోకి జనసేన కార్యకర్తలు


వైఎస్సార్ సీపీలోకి ఏడుకొండలును ఆహ్వానిస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన జనసేన కార్యకర్తలు నిత్యం వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. దీనిలో భాగంగా పట్టణంలో జనసేన కీలక నాయకుడు అడపా ఏడుకొండలు బుధవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమత రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో భీమవరం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నానని వెల్లడించారు. శాశ్వత ప్రాతిపదికన భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. జనసేన, టీడీపీ ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరి నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. గ్రంధి బాలాజీ, చిన్నమిల్లి వెంకటరాయుడు, బండి శక్తీశ్వర సాంబమూర్తి, చెలంకూరి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

ముసునూరు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.వాసు చెప్పారు. కాట్రేనిపాడుకు చెందిన లాము పరశురాములు గోపవరంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం బాటిల్స్ తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తుండడంతో బుధవారం సాయంత్రం ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 650 మి.లీ బూమ్, బూమ్ ఐదు బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుని గురువారం నూజివీడు కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తణుకు: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని తణుకు పట్టణ పోలీసులు బుధవారం పట్టివేశారు. స్థానిక ఎన్టీఆర్ పార్కు వెనుక రేషన్ షాపు నుంచి వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి బియ్యంలోడుతో ఉన్న వ్యాన్‌ను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ నాగరాజు చెప్పారు. బియ్యాన్ని తణుకు నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారని, దీని విలువ రూ.10 లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు.

నేడు మోడరన్ పెంటాథ్లాన్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

పెదవేగి: ఉమ్మడి పశ్చిమగోదావరి మోడరన్ పెంటాథ్లాన్ అండర్-19 జిల్లా జట్ల ఎంపిక పోటీలను పెదవేగిలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహిస్తున్నట్లు అండర్-19 కార్యదర్శి కె.జయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలు హాజరు కావాలని, ఇతర వివరాలకు 99493 66162 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మాదిగలను దగా చేస్తున్న మందకృష్ణ


రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్

లింగపాలెం: వ్యక్తిగత స్వార్థం కోసం మాదిగలను తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడుకు తాకట్టు పెట్టిన వ్యక్తి మందకృష్ణ మాదిగ అని రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం లింగపాలెంలో సందీప్ విలేకర్లతో మాట్లాడుతూ మాదిగలను కేవలం ఎన్నికల సమయంలో మందకృష్ణ మాదిగ అమ్మి వేస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు తప్ప మందకృష్ణ మాదిగను ఏ రాజకీయ పార్టీ నమ్మదన్నారు. ఎన్నికల సమయానికి ప్రతిపక్ష పార్టీలతో ప్యాకేజీ కోసం మాదిగలను మోసం చేస్తూ వస్తున్నాడని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ తన ప్రభుత్వంలో మాదిగలకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో హోంమంత్రి స్థానంలో మాదిగ మహిళను కూర్చోబెట్టి, ఐదేళ్లు కొనసాగించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.